పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో..

రూ. 17.65 లక్షలు టోకరా వేసిన సైబర్ ఛీటర్స్

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో రైల్వే ఉద్యోగికి సైబర్‌నేరగాళ్లు రూ. 17.65 లక్షలు టోకరా వేశారు. మల్కాజిగిరికి చెందిన బాధితుడికి టెలిగ్రామ్ గ్రూప్‌లో ఆధ్య పేరుతో ఒక మెసేజ్ వచ్చింది. అందులో హోటల్ రిజర్వేషన్ చేసే పార్ట్‌టైమ్ ఉద్యోగమంటూ సూచించారు. ఈ మెసేజ్‌కు స్పందించిన బాధితుడు.. సరేనని చెప్పాడు. దీంతో నిందితులు ఓ వెబ్‌సైట్ లింక్‌ను పంపించారు. ఆ లింక్‌లోకి వెళ్లి 30 హోటల్స్‌కు రిజర్వేషన్లు చేయడంతో వెయ్యి రూపాయల కమీషన్ వచ్చింది. దీంతో మరింత ముందుకు పోవాలంటూ నేరగాళ్లు సూచించి.. టెలిగ్రామ్ గ్రూప్‌లో చేరి చర్చకు రావాలని సూచించారు. దీంతో ఆ గ్రూప్‌లోకి చేరిన బాధితుడికి మరింత డబ్బు డిపాజిట్ చేస్తే అధిక లాభాలొస్తాయంటూ సూచించారు. దీంతో బాధితుడు స్పందించి వారి సూచనల మేరకు డబ్బులు డిపాజిట్ చేశాడు. మొదట్లో వెబ్‌సైట్‌లో నష్టాలు కనిపించాయి. మరిన్ని పెట్టుబడులు పెట్టండి.. విజయం వరిస్తుందంటూ టెలిగ్రామ్ గ్రూప్ సభ్యులు చెప్పడంతో బాధితుడు దఫ దఫాలుగా రూ. 17,65,750 పెట్టుబడి పెడుతూ వెళ్లాడు. వెబ్‌సైట్ స్క్రీన్‌పై భారీగా లాభాలు వస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ.. మోసానికి పాల్పడ్డారు. బాధితుడు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సిమ్ కొట్టేసి రూ. 7 లక్షలు స్వాహా..

హస్తినాపురానికి చెందిన వృద్ధుడు తన సెల్‌ఫోన్‌ను గత నెల 29న ఉదయం పోగొట్టుకున్నాడు. ఆ సెల్‌ఫోన్‌లో ఉన్న సిమ్‌కు, అతడి బ్యాంకు ఖాతా అనుసంధానమై ఉంది. కొద్దిసేపు ఎదరు చూసి సిమ్‌కార్డును బ్లాక్ చేయించాడు. మరుసటి రోజు చూసే సరికి తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 7 లక్షలు మాయమైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహేశ్ బ్యాంక్ చైర్మన్, ఎండీపై కేసు నమోదు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏపీ మహేశ్ కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, ఎండీలపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. హిమాయత్‌నగర్‌కు చెందిన ఓంప్రకాశ్ మోదాని కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంకు చైర్మన్‌గా రామ్ ప్రకాశ్ బంగ్, ఎండీగా వీరేందర్ ఖండేల్‌వాల్ కొనసాగుతున్నారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బోర్డు ఆఫ్ డైరెక్టర్ బ్యాంకు కార్యకలాపాలను రోజు వారీగా పరిశీలిస్తూ, బ్యాంక్ కస్టమర్లతో కూడా సమావేశం కావచ్చని, ఎండీకి రూ. 30 లక్షల అత్యధిక రుణం మంజూరు చేసే అర్హత మాత్రమే ఉంటుందని బాధితుడు తెలిపారు. దీంతో పాటు మహేశ్ బ్యాంకులో 2022, జనవరి నెలలో ఆర్‌బీఐ తనిఖీలు కూడా జరిగాయన్నారు. అయితే, చైర్మన్, ఎండీలు డిసెంబర్, 2022 నుంచి ప్రతిరోజు బంజారాహిల్స్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయానికి వెళ్తున్నారని, గతంలో రుణాలు తీసుకొని ఎన్‌పీఏ (నాన్ ఫర్‌ఫామింగ్ అస్టెట్స్)గా మారిన వారికి రుణాలు రెన్యువల్ చేస్తూ 10 శాతం కమీషన్ తీసుకుంటున్నారని, సుమారు రూ. 90 కోట్ల రుణాలు రెన్యువల్ చేశారని ఆరోపించారు. ఇలా బ్యాంకుకు నష్టం చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు బయటకు తీయాలంటూ బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, న్యాయస్థానం ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మాయమైన పక్షి ఆచూకీ వాట్సాప్ స్టేటస్ ద్వారా లభ్యం

పోలీసుల జోక్యంతో యజమాని చెంతకు చేరిన గాలా జాతి పక్షి మైరూ

బంజారాహిల్స్, అక్టోబర్ 2: అల్లారుముద్దుగా పెంచుకున్న పక్షి తప్పిపోయింది. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు వాట్సాప్ స్టేటస్ ఆధారంగా పక్షిని పట్టుకుని యజమానికి అప్పగించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 44లోని ఓ కాఫీషాపు యజమాని నరేందర్ చారి ఆస్ట్రేలియా నుంచి ఇటీవల గాలా జాతికి చెందిన చిలుకను తెప్పించుకున్నాడు. ఆ పక్షికి మైరూ అని పేరుపెట్టుకుని పెంచుకుంటున్నాడు. రూ.1.30 లక్షల వ్యయంతో విదేశాల నుంచి తెప్పించుకున్న ఎక్సోటిక్ పక్షి మూడురోజుల కిందట మాయమైంది. దీంతో బాధితుడు నరేందర్ చారి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేకంగా విదేశాల నుంచి తెప్పించే పక్షులను విక్రయించే పెట్‌షాపులకు, డీలర్లకు సమాచారం ఇచ్చారు. పక్షి కాలికి ఉన్న రింగ్‌లో ప్రత్యేకమైన కోడ్ ఉంటుందని, కోడ్ ద్వారా అది ఎక్కడి నుంచి తెప్పించారనే వివరాలు ఉంటాయని కూడా తెలిసింది. ఇదిలా ఉండగా, ఎర్రగడ్డకు చెందిన సయ్యద్ ముజాహిద్ అనే వ్యక్తి అరుదైన పక్షిని అమ్ముతానని పేర్కొంటూ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. ఆసక్తి ఉన్న వారు తనను సంప్రదించాలని సూచించాడు. ఈ స్టేటస్‌ను చూసిన పెట్‌షాప్ నిర్వాహకులు జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేశ్‌కు సమాచారమిచ్చారు. దీంతో ముజాహిద్‌ను సంప్రదించగా.. తనకు ఎర్రగడ్డలో ఓ వ్యక్తి ఈ పక్షిని రూ. 50వేలకు విక్రయించాడని, నేను రూ.70వేలకు విక్రయిస్తానని చెప్పాడు. దీంతో జరిగిన విషయాన్ని అతడికి చెప్పిన పోలీసులు.. పక్షిని స్వాధీనం చేసుకుని యజమాని నరేందర్ చారికి అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులకు పక్షి యజమాని కృతజ్ఞతలు తెలిపాడు.

మేము అమాయకులమంటూ.. బుకాయింపు

- పోలీసుల విచారణలో డ్రగ్ వినియోగదారుల వ్యవహారం
- దర్యాప్తులో డ్రగ్ తీసుకున్నట్లు వెల్లడి..!

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): డ్రగ్ ఎలా ఉంటుందో మాకు తెలియదు.. మేము అమాయకులం.. అంటూ టీనాబ్ విచారణలో కొందరు డ్రగ్ వినియోగదారులు చెబుతున్నారు. వాళ్లు చెబుతున్న విషయాలతో అధికారులు విస్మయం చెందుతున్నారు. డ్రగ్ పెడ్లర్లు, వారి వద్ద డ్రగ్ తీసుకొని వాడుతున్న వినియోగదారులకు సంబంధించిన చిట్టాను టీనాబ్ నివేదిక రూపంలో తయారు చేసింది. ఆ నివేదిక ఆధారంగానే విచారిస్తున్నారు. డ్రగ్ వినియోగదారులు మాత్రం పొంతనలేని సమాధానమిస్తున్నారని తెలిసింది. నెల రోజుల కిందట మాదాపూర్‌లో బయటపడ్డ డ్రగ్ పార్టీ వ్యవహారంలో సినీ ఫైనాన్సియర్ వెంకటరత్నాకర్ రెడ్డి, భాస్కర్ బాలాజీ, మురళిని అరెస్ట్ చేసి, వారి నెట్‌వర్క్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. ఇందులో చాలా మంది వినియోగదారులను అరెస్ట్ చేయగా.. కొందరు ముందస్తు బెయిల్ కోసం కోర్టుకు వెళ్లారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, పోలీసుల విచారణకు సహకరించాలంటూ వారిని న్యాయస్థానం ఆదేశించింది. అదేవిధంగా వారికి 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వాలంటూ కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సినీ హీరో నవదీప్ పోలీసుల ముందు హాజరయ్యాడు. అలాగే, ఈవెంట్స్ నిర్వాహకుడు కలహార్ రెడ్డి, మరికొందరు కూడా గుడిమల్కాపూర్ పోలీసుల ముందు లొంగిపోయారు. మాదాపూర్ కేసులో 81 మంది అనుమానితుల వివరాలను టీనాబ్ సేకరించింది. అందులో 34 మంది వివరాలను సేకరించి, 12 మందిని అరెస్ట్ కూడా చేశారు.

తుమకేమీ సంబంధం లేదు.!

విచారణలో డ్రగ్ వినియోగదారులు ఇస్తున్న సమాధానాలకు పొంతన ఉండటంలేదు. తమకు డ్రగ్ అలవాటు లేదంటూ కొన్ని సార్లు బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, ఫలానా డ్రగ్ పెడ్లర్‌తో మీకున్న సంబంధాలేంటీ.. అని లోతుగా ప్రశ్నించే వరకు ఇప్పుడు కాదు చాలా రోజుల కిందట డ్రగ్ తీసుకున్నామని, ఇప్పుడు మారిపోయానంటూ సమాధానాలు చెబుతున్నారు. వీళ్లు చెప్పే సమాధానాలను సాంకేతిక పరంగా టీనాబ్ నిర్ధారించుకుంటున్నది. అయితే, వినియోగదారులు డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ జరిగితే.. అలాంటి వారిని అరెస్ట్ చేస్తున్నారు. పోలీసులకు ప్రధాన నిందితులు దొరకగానే.. వారి నెట్‌వర్క్‌లో ఉన్న వారందరి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. పోలీసుల నిఘా నుంచి కొన్నాళ్ల పాటు తప్పించుకోవాలని వారు ప్రయత్నిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అలస్యంగా పోలీసులకు చిక్కడంతో వైద్య పరీక్షల్లో డ్రగ్ ఆనవాళ్లు దొరకవనే భావనతో చాలా మంది అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రగ్ పెడ్లర్లతో పాటు వినియోగదారులపై టీనాబ్ మరింత నిఘాను పెంచింది.

4న కేబుల్ బ్రిడ్జి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైక్లింగ్ టు ఓట్, వాకథాన్ అవగాహన కార్యక్రమాల దృష్ట్యా ఈ నెల 4న దుర్గం చెరువు, కేబుల్‌బ్రిడ్జి పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ వెల్లడించారు. బుధవారం తెల్లవారుజాము 5.30గంటల నుంచి ఉదయం 8.30గంటల వరకు కేబుల్ బ్రిడ్జి, దాని పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కేబుల్‌బ్రిడ్జి, సీఓడీ జంక్షన్, కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే ఐటీసీ కొహినూర్ వెనక వైపు రోడ్డు, మైహోం అభ్రా, టీ-హబ్ నుంచి సీ- గేట్ వెళ్లే మార్గం, ఐకియా రోటరీ నుంచి కేబుల బ్రిడ్జి వెళ్లే మార్గాలను పూర్తిగా ఉదయం 5.30 గంటల నుంచి 8.30గంటల వరకు 3 గంటల పాటు మూసివేస్తున్నట్లు వెల్లడించారు.

దారి మళ్లింపు మార్గాలు:

- రోడ్‌నం.45 నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లే వాహనాలను కావూరి హిల్స్ వద్ద దారి మళ్లించి, మాదాపూర్ పీఎస్, సీఓడీ జంక్షన్, సైబర్‌టవర్స్ మీదుగా అనుమతిస్తారు.
- బయోడైవర్సిటీ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లే వాహనాలను సైబర్‌టవర్స్ మీదుగా దారి మళ్లించి, సీఓడీ, రోడ్.నం.45 మీదుగా దారి మళ్లిస్తారు.
- మీనాక్షి జంక్షన్ నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు వెళ్లాల్సిన వాహనాలను ఐకియా రోటరీ మీదుగా దారి మళ్లించి సైబర్‌టవర్స్, సీఓడీ, రోడ్ నం.45మీదుగా అనుమతిస్తారు.

రూ.2.10లక్షల నష్టపరిహారం చెల్లించాలి

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): రెసిడెన్షియల్ కాలనీలో ప్లాట్ కొనుగోలుదారుకు రూ.2.10 లక్షల (కోర్టు ఖర్చులతో కలుపుకొని) నష్టపరిహారం చెల్లించాలని డీఎల్ఎఫ్ గాయత్రీ డెవలపర్స్ కంపెనీకి హైదరాబాద్ వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. సికింద్రాబాద్‌కు చెందిన సుధీర్.. శంషాబాద్ శివారులో అభివృద్ధి చేసిన రెసిడెన్షియల్ కాలనీలో 267 గజాల స్థలం కొనుగోలు చేశాడు. సదరు సంస్థ అలాట్‌మెంట్ లెటర్ కూడా 2019 ఏప్రిల్‌లో వచ్చింది. వాయిదాల ప్రకారం మొత్తం డబ్బు చెల్లించారు. అయినా, ప్లాట్‌ను అప్పగించలేదు. అగ్రిమెంట్‌లోని క్లాస్ (డి) ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సంస్థను హెచ్చరించారు. అయినా స్పందించకపోవడంతో కొనుగోలుదారుడు హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-1ను సంప్రదించి ఫిర్యాదు చేశారు. కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకట సుబ్బలక్ష్మి, సభ్యురాలు సి.లక్ష్మీప్రసన్నలతో కూడిన బెంచ్ కేసును పరిశీలించింది. సదరు సంస్థకు నోటీసులు జారీ చేసినా కమిషన్ ఎదుట హాజరుకాలేదు. దీంతో ప్లాట్ కొనుగోలుదారుకు 45 రోజుల్లో నష్టపరిహారాన్ని అందజేయాలంటూ కమిషన్ ఆదేశించింది.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న గంగపుత్ర సంఘాల ప్రతినిధులు

ఉప్పల్, అక్టోబర్ 2: నవంబర్ 21న అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగపుత్రుల 'ఒకే జాతి - ఒకే సంఘం' లక్ష్యంగా నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఉప్పల్ భగాయత్‌లోని గంగపుత్రుల ఆత్మగౌరవ స్థలంలో సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల గంగపుత్ర ముఖ్యనాయకులు హాజరైన ఈ సమావేశంలో గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, తవిడబోయిన గిరిబాబు గంగపుత్ర, పూస బాలకిషన్, కొప్పు పద్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గంగపుత్ర సంఘాలను ఎన్నో పేర్లతో ఏర్పాటు చేసుకొని, రాజకీయ పార్టీలకు అనుబంధ సంఘాలుగా మారి నాయకులకు తొత్తులుగా మారి జాతి నాశనానికి కారణమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర, జిల్లా, మండలాలకు అధ్యక్షులను ఎన్నుకొని తద్వారా ఏక సంఘం నిర్మాణం జరిగి బలమైన గంగపుత్ర సంఘం ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డి, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, కరీంనగర్, నల్లగొండ జిల్లాల నుంచి గంగపుత్ర నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కైరంకొండ నర్సింగ్, సలహాదారులు ఉట్నూర్ బాలయ్య, పల్లికొండ నర్సయ్య, ఉపాధ్యక్షులు పూస శ్రీనివాస్, మానకొల సురేశ్, కోశాధికారి చింతకింద రవి, గంగ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ మల్కు మహేందర్, ఎన్ఎఫ్‌బీ పంపరి జనార్దన్, సింగారం రవీందర్, గోలివాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ నియామకంపై హర్షం : టీజీవో నేతలు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు కొత్త పే స్కేల్ చెల్లింపునకు పే రివిజన్ కమిటీని (పీఆర్సీ) ఏర్పాటు చేయడంపై టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణాయాదవ్, జనరల్ సెక్రటరీ, జల మండలి శాఖ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు సవరించేందుకు ప్రభుత్వం నూతన పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ చైర్మన్‌గా ఎన్.శివశంకర్ (రిటైర్డ్ ఐఏఎస్), సభ్యుడిగా బి. రామయ్య (రిటైర్డ్ ఐఏఎస్)ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లూలూ మాల్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు చెక్

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): లూలూ మాల్ వద్ద ట్రాఫిక్‌కు ఏర్పడిన అంతరాయం పునరావృతం కాకుండా కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం పెద్ద సంఖ్యలో వాహనదారులు మలేషియా టౌన్‌షిప్ నుంచే జేఎన్‌టీయూ వైపు వచ్చి ఫ్లైఓవర్ ప్రారంభంలో కుడివైపు వెళ్లే ప్రయత్నం చేశారు. నాలుగు లేన్లలో వచ్చిన వాహనాలు ఒక్కసారిగా లూలూ మాల్‌కు వెళ్లేందుకు కుడివైపు మలుపు తీసుకునే ప్రయత్నం చేయడంతో.. వెనకాల ఉన్న వాహనాలకు ఆటంకం ఏర్పడి ఒక్కసారిగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం జరిగిన ఈ ఉదంతం పునరావృతం కాకుండా సోమవారం కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచే రంగంలోకి దిగారు. మలేషియా టౌన్‌షిప్ నుంచి వచ్చే వాహనాలు లూలూ మాల్ వెళ్లేందుకు ఫ్లైఓవర్ ప్రారంభంలో ఉన్న కుడివైపు యూ టర్న్ తీసుకోకుండా.. 100 మీటర్ల దూరంలోనే యూటర్న్‌ను ఏర్పాటు చేసినట్లు కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.నగేశ్ తెలిపారు. దీనివల్ల ఎడమ వైపు వెళ్లే వాహనాలకు, నేరుగా ముందు వైపు వెళ్లే వాహనాలకు లైన్ క్లియర్ కావడమే కాకుండా లూలూ మాల్ వైపు వెళ్లే వాహనాలు సైతం సులువుగా కుడివైపు యూటర్న్ తీసుకుని వెళ్లేలా ఏర్పాటు చేశామని తెలిపారు. అంతే కాకుండా.. ఎక్కడ కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఈ మార్గంలో 10 నుంచి 15 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా అడ్డదిడ్డంగా పార్క్ చేసే వాహనాలను తొలిగించేందుకు నాలుగు టోయింగ్ వాహనాలను ఏర్పాటు చేసి, జరిమానాలు విధించినట్లు ఇన్‌స్పెక్టర్ నగేశ్ వెల్లడించారు. సాధారణ ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.